



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

EVENING EDITION 4:00 PM గురువారం 24-11-2022 పేజీలు: 02


## అమెరికా వీసా కోసం 1000 రోజులు




అమెరికా వీసాల కోసం నిరీక్షణ సమయం పెరిగిపోతోంది. బిజినెస్ (బీ-1), టూరిస్ట్ (బీ-2) వీసాల కోసం తొలిసారిగా 1000 రోజుల వరకూ వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముంబై వాసులు 999 రోజులు, హైదరాబాద్ 994, ఢిల్లీ 961, చెన్నై 948, కోల్ కతా వాసులు 904 రోజులు ఇంటర్వ్యూ కోసం నిరీక్షించాల్సి ఉందని ఢిల్లీలోని అమెరికా ఎంబసీ అధికారి తెలిపారు. అత్యవసరంగా ఎవరైనా వెళ్లాలనుకుంటే కారణాలు చూపిస్తే వెంటనే అపాయింట్ మెంట్ ఇస్తామని అమెరిగా విదేశాంగ శాఖ ట్వీట్ చేసింది.

## టాటా కన్జూమర్ చేతికి బిస్లరీ




భారతదేశపు అతిపెద్ద ప్యాకేజ్డ్ వాటర్ మేకర్ బిస్లరీ ఇంటర్నేషనల్‌ను టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ కొనుగోలు చేయనుంది. బిస్లరీ కంపెనీ చైర్మన్ రమేష్ చౌహాన్ వ్యాఖ్యలని ఉటంకిస్తూ ఎకనామిక్ టైమ్స్ నివేదించింది. బిస్లరీ ఆవిష్కర్త రమేశ్ చౌహాన్ బిస్లరీని టాటా సంస్థకు రూ. 7వేల కోట్లకు విక్రయించనున్నారు. ఒప్పందంలో భాగంగా ప్రస్తుత నిర్వహణ రెండేళ్ల పాటు కొనసాగనుంది. కుమార్తె జయంతి వ్యాపారంపై పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో 82 ఏళ్ల చౌహాన్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. బిస్లరీ విక్రయం బాధాకరమైన నిర్ణయమే అయినప్పటికీ టాటా గ్రూప్ మరింత అభివృద్ధి చేసి, ఇంకా బాగా చూసుకుంటుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

## చైనాలో భారీగా కరోనా కేసులు నమోదు



చైనాలో రికార్డు స్థాయిలో కరోనా కేసులు నమోదు అయ్యాయి. ఆ దేశంలో బుధవారం ఒక్కరోజే 31,454 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కరోనా మహమ్మారి ప్రారంభం నుండి చైనాలో నమోదైన రోజువారీ కోవిడ్ కేసుల్లో ఇదే అత్యధికం. కరోనా కేసులు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో చైనా ప్రభుత్వం అలర్ట్ అయ్యింది. లాక్‌డౌన్ లు, ప్రయాణ పరిమితులను విధించింది. సామూహిక ఆరోగ్య పరీక్షలు చేస్తోంది. కరోనా వ్యాప్తిని అరికట్టడానికి జాగ్రత్తలు తీసుకుంటోంది.



## కమల్ హాసన్‌కు అస్వస్థత

ప్రముఖ నటుడు కమల్ హాసన్ అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను చెన్నైలోని పోరూర్ రామచంద్ర ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. జ్వరంతో పాటు శ్వాస పీల్చుకోవడంలో ఆయన ఇబ్బంది పడుతున్నారు. కమల్ ఇంతకుముందు కరోనా బారిన పడ్డారు. అప్పుడు ఆసుపత్రిలో చికిత్స పొందారు. తిరిగి ఇప్పుడు శ్వాస సమస్య తలెత్తడంతో ఆసుపత్రిలో చేరారు. పోస్ట్ కోవిడ్ లక్షణాలు ఉండొచ్చని, అందుకే శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులు వచ్చాయని తెలుస్తోంది.

## రష్యాకు ఈయూ షాక్



ప్రపంచ దేశాల హెచ్చరికలు బేఖాతరు చేస్తూ ఉక్రెయిన్ పై యుద్ధం కొనసాగిస్తోన్న రష్యాకు ఈయూ షాకిచ్చింది. రష్యాను 'ఉగ్రవాద ప్రోత్సాహక దేశం'గా యూరోపియన్ పార్లమెంట్ ప్రకటించింది. ఈ తీర్మానానికి ఈయూ పార్లమెంట్ లో ఓటింగ్ నిర్వహించగా 494 మంది సభ్యులు మద్దతు పలికారు. 58 మంది వ్యతిరేకించగా.. 44 మంది ఓటింగ్ కు దూరంగా ఉన్నారు. ఉక్రెయిన్ లోని విద్యుత్ సంస్థలు, ఆస్పత్రులు, పాఠశాలలు, పౌరుల నివాసాలపై రష్యా దాడితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈయూ తెలిపింది.




## 3వ రోజు కొనసాగుతున్న
# ఐటీ దాడులు

### మంత్రి మల్లారెడ్డి కార్యాలయాలు, బంధువుల ఇండ్లల్లో కొనసాగుతున్న ఐటీ సోదాలు

రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డికి చెందిన సంస్థలు, బంధువుల ఇళ్లల్లోనూ మూడో రోజు ఐటీశాఖ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. మంత్రి మల్లారెడ్డికి చెందిన సంస్థలు, బంధువుల ఇళ్లల్లో ఐటీశాఖ అధికారుల సోదాలు ముగిశాయి. కుత్బుల్లాపూర్ లోని మల్లారెడ్డి బంధువుల ఇంట్లో సోదాలు పూర్తయ్యాయి. దూలపల్లిలోని ప్రవీణ్ రెడ్డి, సుచిత్రలోని త్రిశూల్ రెడ్డి ఇంట్లో సోదాలు ముగిశాయి. మెడికల్, డెంటల్ కళాశాలలు, మల్లారెడ్డి వర్సిటీలోనూ సోదాలు చేశారు.

అంతకుముందు.. తమ ఇంట్లో సోదాలు ముగిసిన తర్వాత పంచనామా నివేదికలను మంత్రి మల్లారెడ్డికి ఐటీ అధికారులు అందజేశారు. ఈనెల 28వ తేదీన (సోమవారం) ఐటీ ఎదుట హాజరు కావాలంటూ నోటీసుల్లో పేర్కొన్నారు. మరోవైపు మల్లారెడ్డి అల్లుడు రాజశేఖర్ ఇంట్లో సోదాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ తనిఖీల్లో 10 కోట్ల 50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

**ఐటీశాఖ అధికారులపై మల్లారెడ్డి ఆగ్రహం**

అర్ధరాత్రి సమయంలో మంత్రి మల్లారెడ్డి.. గన్ మెన్, సెక్యూరిటీ లేకుండా కేవలం డ్రైవర్ తో హాస్పిటల్ కి వెళ్లారు. తప్పుడు పత్రాలపై ఐటీశాఖ అధికారులు బలవంతంగా సంతకాలు తీసుకున్నారని ఆరోపించారు. మరోవైపు ఇదే విషయంపై బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసేందుకు మంత్రి మల్లారెడ్డితో పాటు ఆయన చిన్న కుమారుడు వెళ్లారు. న్ని కోట్లు రాశారని మంత్రి మల్లారెడ్డి ప్రశ్నించడంతో రూ.100 కోట్లు అని ఐటీ అధికారి రత్నాకర్ సమాధానమిచ్చారని తెలుస్తోంది. ఇదే విషయంపై మంత్రి మల్లారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. మీడియా ద్వారా ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లండి అని అన్నారు. ఐటీ అధికారులు, సిబ్బంది తమపై దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. హాస్పిటల్ చికిత్స పొందుతున్న తమ పెద్ద కుమారుడుతో బలవంతంగా సంతకం చేయించుకున్నారని చెప్పారు. దీనిపై మళ్లీ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. గతంలోనూ 3సార్లు ఐటీ అధికారుల సోదాలు జరిగాయి కానీ, ఇంత దౌర్జన్యం ఎప్పుడూ చూడలేదన్నారు. 'మా ఇండ్లు, బంధువుల ఇండ్లల్లో సోదాలు చేస్తున్న సమయంలో ఐటీ అధికారులు చాలా రకాల ఇబ్బందులు పెడుతున్నారు. మా వాళ్లను ఇష్టం వచ్చినట్లు కొడుతున్నారు. వాళ్లు ఐటీ అధికారులు కాదు.. రక్త పిశాచులు. ఉన్నవి లేనట్టుగా, లేనివి ఉన్నట్టుగా రాస్తున్నారు. చిత్ర హింసలకు గురి చేస్తున్నారు' అంటూ మంత్రి మల్లారెడ్డి ఆరోపించారు.



## రఘురామకృష్ణంరాజుకు తెలంగాణ సిట్ నోటీసులు

ఏపీకి చెందిన వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణంరాజుకు తెలంగాణ సిట్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో విచారణకు రావాలంటూ 41ఏ సీఆర్ పీసీ కింద నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఫామ్ హౌస్ కేసు నిందితులను రఘురామ రాజు గతంలో కలిశారని.. టీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలుకు రూ.100 కోట్లు సమకూరుస్తున్నాను అని ఎంపీ అన్నట్లు సమాచారం.




## ఏపీలో కొత్త బస్సులు 'స్టార్ లైనర్'

దూర ప్రాంత ప్రయాణీకుల కోసం ఏపీఎస్ఆర్టీసీ.. సరికొత్త నాన్ ఏసీ స్లీపర్ బస్సులను అందుబాటులోకి తెచ్చింది. అయితే వీటికి పేరు పెట్టాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ప్రయాణీకులతో పాటు ఉద్యోగులకూ ఓ ఆఫర్ ప్రకటించారు. 3,585 మంది రకరకాల పేర్లు ప్రతిపాదించగా.. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లికి చెందిన బి.సుమతి అనే మహిళ ప్రతిపాదించిన 'స్టార్ లైనర్' పేరును ఖరారు చేశారు. అలాగే ఆమెను సత్కరించి రూ.10 వేల రివార్డు అందించారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా 62 సర్వీసులను నడపాలని ఆర్టీసీ భావిస్తోంది.



## మేఘాలయను వణికించిన భూకంపం

వరుస భూకంపాలు వణికిస్తున్నాయి. మేఘాలయలో ఈ తెల్లవారుజామున 3.46 గంటలకు తురాకు తూర్పు ఈశాన్యంగా 37 కి.మీ దూరంలో భూమి కంపించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.4గా ఉందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. ఈ భూకంపం లోతు 5 కి.మీ లోతున నమోదైందని అధికారులు తెలిపారు. భూకంపంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.

## రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో
# ప్రియాంక గాంధీ



రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర మధ్యప్రదేశ్‌లో కొనసాగుతోంది. వచ్చే ఏడాది ఎంపీలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు భారీగా ఏర్పాట్లు చేశారు. కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ రాహుల్‌తో కలిసి యాత్రలో పాల్గొన్నారు. ప్రియాంక, రాహుల్ భుజం..భుజం కలిసి నడుస్తున్న ఫొటోలను కాంగ్రెస్ తన ట్విట్టర్ లో పోస్ట్ చేసింది. కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ కూడా ఈ యాత్రలో పాల్గొన్నారు. భారత్ జోడోయాత్ర మహారాష్ట్ర నుంచి మధ్యప్రదేశ్‌లోకి ప్రవేశించడంతో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు త్రివర్ణ పతాకాన్ని చేతుల్లో పట్టుకుని బోదర్లి గ్రామానికి చేరుకున్నారు. ప్రజలను ఉద్దేశించిన మాట్లాడిన రాహుల్ దేశంలో వ్యాప్తి చెందుతున్న విద్వేషం, హింస, భయాందోళనలకు వ్యతిరేకంగా ఈ యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. కన్యాకుమారి నుంచి త్రివర్ణ పతాకాన్ని చేతుల్లో తీసుకుని భారత్ జోడో యాత్రను ప్రారంభించానని..ఈ మువ్వెనెల జెండాను శ్రీనగర్ కు చేరుకోకుండా ఎవరూ ఆపలేరన్నారు. ఈ యాత్రలో సీనియర్ నేతలు కమల్ నాథ్, దిగ్విజయ్ సింగ్ పాల్గొన్నారు. రాహుల్ గాంధీ యాత్రకు కౌంటర్ గా మధ్యప్రదేశ్ లో కొన్ని గంటల ముందు బీజేపీ ర్యాలీ నిర్వహించింది. గిరిజనుల ఐకాన్ తాంత్యాభీల్ జన్మస్థలం ఖాండ్వాలో బీజేపీ జంజాతీయ గౌరవ్ యాత్ర ప్రారంభించింది. ఈ ర్యాలీకి సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, నలుగురు రాష్ట్ర మంత్రులు హాజరయ్యారు. బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాడుతూ తాంత్యాభీల్ చనిపోయారు. ఇండోర్ లోని పాతాల్పానీలో డిసెంబర్ 4న బీజేపీ ర్యాలీ ముగుస్తుంది. అదే రోజు కాంగ్రెస్ ర్యాలీ మధ్యప్రదేశ్‌లోని ఆరు జిల్లాలను కవర్ చేసిన తర్వాత రాజస్థాన్‌లోకి ప్రవేశిస్తుంది.



## సారా అలీఖాన్ లేటెస్ట్ స్టిల్స్

బాలీవుడ్ నటి సారా అలీఖాన్ ఇకపై ఎలాంటి గుర్తింపుపై ఆధారపడలేదు. స్టార్‌కిడ్ అయినప్పటికీ, ఆమె పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నది . ఇండస్ట్రీలో అడుగు పెట్టడానికి తన సినీ కుటుంబం అవసరం లేదని అతి తక్కువ కాలంలోనే సారా ప్రేక్షకుల ముందు కొచ్చింది. ఎలాంటి పాత్రలోనైనా తనని తాను చక్కగా తీర్చిదిద్దుకుంటుంది. అలాంటి పరిస్థితిలో, ఆమె ప్రతి సినిమా కోసం అభిమానులు ఉత్సుకతతో ఉండగా, మరోవైపు, నటి కూడా అనేక కొత్త ప్రాజెక్టలను పొందుతోంది. సారా నటనను ప్రజలు బాగా ఇష్టపడడమే కాకుండా, ఆమె సరసమైన శైలిని చూసి అభిమానులు కూడా పిచ్చిగా ఉన్నారు.

## మాంచెస్టర్‌తో రొనాల్డో కటీఫ్




ఫిఫా వరల్డ్ కప్‌లో తన తొలి మ్యాచ్‌కు ముందే పోర్చుగల్ లెజెండ్ క్రిస్టియానో రొనాల్డో హెడ్‌లైన్స్‌లోకి వచ్చాడు. ప్రముఖ ఫుట్‌బాల్ క్లబ్, ప్రీమియర్ లీగ్ టీమ్ మాంచెస్టర్ యునైటెడ్ నుంచి రొనాల్డో వైదొలిగాడు. పరస్పర అంగీకారంతో కాంట్రాక్టును రద్దు చేసుకున్నట్టు మాంచెస్టర్ ప్రకటించింది. ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపింది. రొనాల్డో సైతం ఈ విషయాన్ని ధృవీకరించాడు. మాంచెస్టర్‌తో చర్చించి కాంట్రాక్ట్‌ను ముందుగానే ముగించుకోవాలని అంగీకరించామని చెప్పాడు. రొనాల్డో రెండు పర్యాయాల్లో మాంచెస్టర్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 2003 నుంచి 2009 వరకు మాంచెస్టర్ టీమ్‌లో సూపర్ స్టార్‌గా వెలుగొందాడు. 2021లో మాంచెస్టర్‌కు రొనాల్డో తిరిగొచ్చాడు. దాదాపు రూ.125 కోట్లతో మాంచెస్టర్‌తో రెండేళ్ల కాంట్రాక్ట్ కుదుర్చుకున్నాడు. కానీ, ఈ ఏడాదిలో రొనాల్డో పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు.

సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
EVENING EDITION



## నోరు మూసుకొని జర్మనీ ఆటగాళ్ల నిరసన

'వన్ లవ్' ఆర్మ్‌బ్యాండ్‌పై ఫిఫా నిర్ణయానికి వ్యతిరేకంగా జర్మనీ ఆటగాళ్ల వినూత్న నిరసన తెలిపారు. ప్రపంచకప్ టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్న ఖతర్‌లో వివిధ వర్గాలపై కొనసాగుతున్న వివక్షను నిరసిస్తూ మ్యాచ్‌ల సందర్భంగా 'వన్ లవ్' ఆర్మ్‌బ్యాండ్ ధరించి సంఘీభావం తెలపాలని ఏడు యూరోపియన్ జట్లు నిర్ణయం తీసుకున్నాయి. అయితే ఆటగాళ్లెవరైనా 'వన్ లవ్' బ్యాండ్‌తో బరిలోకి దిగితే వేటు తప్పదని 'ఫిఫా' హెచ్చరించింది. దీనికి నిరసనగా జర్మనీ ఆటగాళ్లు కుడిచేతితో తమ 'నోరు మూసుకొని' నిరసన తెలిపారు. 'ఫిఫా' నిర్ణయంపై యూరోపియన్ దేశాలు విమర్శలు గుప్పిస్తున్నాయి.

### పెట్రోల్ బంక్ లో గొడవ..

## కొట్టుకున్న ఇరువర్గాలు



పెట్రోల్ పంపు వద్ద ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్ లో జరిగింది. సిహానిగేట్ ఏరియా పాత బస్టాండ్ సమీపంలోని పెట్రోల్ పంపు వద్ద ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ గొడవకు సంబంధించిన వీడియో బయటకు వచ్చింది. విచారణ అనంతరం అవసరమైన చర్యలు తీసుకోవాలని సిహానిగేట్ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ ను ఆదేశించినట్లు ఘజియాబాద్ పోలీసులు ట్విట్టర్ ద్వారా తెలిపారు. అయితే ఇరువర్గాల మధ్య గొడవ ఎందుకు జరిగింది అనే దానిపై కారణాలు తెలియరాలేదు.



## అగ్ని-3 క్షిపణి ప్రయోగం విజయవంతం

ఒడిశా తీరంలోని ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి అగ్ని-3 మధ్యంతర శ్రేణి క్షిపణి పరీక్షను భారత్ బుధవారం విజయవంతంగా నిర్వహించినట్లు డీఆర్ డీవో వర్గాలు వెల్లడించాయి. సాధారణ సైనిక శిక్షణ ప్రయోగాల్లో భాగంగా ఈ బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ క్షిపణి అణు వార్ హెడ్ తీసుకెళ్లి.. 3,500 కి.మీ లక్ష్యాలను కూడా ఛేదించగలదు. 2006 జూన్ 9న తొలిసారి అగ్ని-3 క్షిపణి మొదటి శ్రేణి ప్రయోగించగా విఫలమైంది. 2007లో రెండో క్షిపణిని విజయవంతంగా ప్రయోగించారు.

## రేపు భారత్-న్యూజిలాండ్

# మొదటి వన్డే మ్యాచ్




న్యూజిలాండ్ పర్యటనలో టీ20 సిరీస్ ను కైవసం చేసుకున్న టీమిండియా మరో ఆసక్తికర మ్యాచ్ కు సిద్ధమైంది. సగం మంది ఆటగాళ్లతో పాటు టీ20 ఫార్మాట్‌లో ఆడిన కెప్టెన్ హార్దిక్ పాండ్యా ఇంటికి చేరుకున్నాడు. జట్టులోకి వచ్చిన యువ ఆటగాళ్లతో శిఖర్ ధావన్ జట్టును నడిపించనున్నాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా శుక్రవారం ఆక్లాండ్‌లో జరిగే తొలి మ్యాచ్‌లో ఆతిథ్య న్యూజిలాండ్‌తో గబ్బర్ సేన తలపడనుంది. సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో గెలిచి కివీస్‌ను ఒత్తిడిలోకి నెట్టాలని టీమ్ ఇండియా భావిస్తోంది. కానీ సీనియర్లు రోహిత్, కోహ్లీ లేకపోవడం కుర్రాళ్లకు ఈ సిరీస్ మంచి అవకాశం. అయితే తుది జట్టులో ఎవరిని తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. టీ20 సిరీస్‌లో అవకాశం దక్కించుకోని సంజూ శాంసన్‌కు కనీసం వన్డే సిరీస్‌లోనైనా అవకాశం లభిస్తుందా? అంటే అవుననే చెప్పలేని పరిస్థితి నెలకొంది. అతనికి ఆల్ రౌండర్ దీపక్ హుడాతో పోటీ ఉంది. కెప్టెన్ శిఖర్ ధావన్, శుభ్‌మన్ గిల్ ఓపెనర్లుగా ఆడనుండగా, సూర్యకుమార్ యాదవ్ మూడో స్థానంలో ఆడనున్నారు. శ్రేయాస్ అయ్యర్ నాలుగో స్థానంలో బరిలోకి దిగాడు. అయితే టీ20 ఫార్మాట్‌లో వరుసగా విఫలమైన శ్రేయస్ అయ్యర్‌ను పక్కనపెట్టాలని భావిస్తే మాత్రం సంజూ శాంసన్ చోటుకు డోకా లేదు. కానీ అయ్యర్‌కు మరో అవకాశం ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. పేలవ ఫామ్ తో సతమతమవుతున్న రిషబ్ పంత్ కు వైస్ కెప్టెన్ హోదాలో జట్టులో చోటు దక్కనుంది. టీ20ల్లో ఘోరంగా విఫలమైన అతనికి ఈ సిరీస్ చాలా కీలకం. ఇక్కడ విఫలమైతే.. జట్టులో స్థానం కోల్పోయే ప్రమాదం ఉంది. సంజూ శాంసన్, దీపక్ హుడాలలో ఒకరు ఆరో స్థానాన్ని కైవసం చేసుకుంటారు. ఆల్ రౌండర్ కావాలంటే దీపక్ హుడా జట్టులోకి వస్తాడు. టీ20ల్లో సత్తా చాటాడు. దీపక్ హుడా జట్టులో ఉంటే టీమ్ ఇండియాకు అదనపు బౌలింగ్ ఆప్షన్ ఉంటుంది. టీమ్ మేనేజ్ మెంట్ కూడా ఆల్ రౌండర్లకే ప్రాధాన్యత ఇస్తుందని టీ20 సిరీస్ తో తేలిపోయింది. పేస్ ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ ఆడటం ఖాయం కాగా.. అర్ష్‌దీప్ సింగ్ మరో పేస్ బౌలర్‌గా బరిలోకి దిగనున్నాడు. ఇక మూడో పేసర్ ఆప్షన్స్‌లో ఉమ్రాన్ మాలిక్‌కు సీనియర్ దీపక్ చాహర్‌తో పోటీ నెలకొంది. ప్రపంచకప్ ముందు గాయంతో జట్టు దూరమైన దీపక్ చాహర్ మళ్లీ ఈ సిరీస్‌తో రీఎంట్రీ ఇవ్వనున్నాడు. రేపు ఉదయం 7 గంటలకు ఈ మ్యాచ్ జరగనుంది.

తుది జట్టు(అంచనా): శిఖర్ ధావన్, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్, సంజూ శాంసన్/దీపక్ హుడా, ఉమ్రాన్ మాలిక్/దీపక్ చాహర్, శార్దూల్ ఠాకూర్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, యుజ్వేంద్ర చాహల్



## తిరుమలను వ్యాపార కేంద్రంగా మార్చారు

టీటీడీని వ్యాపార కేంద్రంగా మార్చారని వివిధ రాష్ట్రాలకు చెందిన 30 మంది పీఠాధిపతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీవారి దర్శనార్థం వీరంతా తిరుమలకు రాగా.. మహాద్వారం నుంచి దర్శనానికి అనుమతించకపోవడంపై నిరసన తెలిపారు. తిరుమలలో సామాన్యులకు ఇబ్బందులు తప్పడం లేదని విజయవాడ శ్రీయోగి పీఠం అధిపతి శ్రీయోగి అతిథేశ్వరానంద ఆరోపించారు. టీటీడీలో మార్పులు రాకపోతే దేశంలోని 900 పీఠాధిపతుల ఆశీర్వాదంతో ఏపీలో కొత్త పార్టీ స్థాపిస్తామన్నారు.




### నెల్లూరు కోర్టులో ఫైళ్ల చోరీ కేసు

## సీబీఐకి అప్పగింత

నెల్లూరు కోర్టులో ఫైళ్ల చోరీ కేసుపై ఏపీ హైకోర్టు గురువారం తీర్పు వెల్లడించింది. నెల్లూరు కోర్టు చోరీ కేసును సీబీఐకి అప్పగిస్తూ ఏపీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మాజీ మంత్రి సోమిరెడ్డిపై మంత్రి కాకాని చేసిన ఆరోపణలపై గతంలో కేసు నమోదు కాగా, ఆరోపణల కేసు కోర్టు విచారణలో ఉండగానే ఫైళ్లు చోరీ అయ్యాయి. దీంతో నెల్లూరు కోర్టులో చోరీ కేసును ఏపీ హైకోర్టు సీరియస్ గా తీసుకుంది. చోరీ కేసును సుమోటోగా స్వీకరించింది. కేసు విచారణను సీబీఐకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.



### 2 రోజులుగా అమ్మమ్మ

## మృతదేహం పక్కనే బాలుడు

ఇండోనేసియాలోని జావా ద్వీపంలో రెండ్రోజుల క్రితం భారీ భూకంపం సంభవించిం విషయం తెలిసిందే. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 271కి చేరింది. శిథిలాల కింద చిక్కుకున్న మృతదేహాలను సహాయసిబ్బంది బయటకు తీస్తున్నారు. ఇందుకోసం సుమారు 12,000 మంది సైనికులను రంగంలోకి దించారు. ఈ క్రమంలో శిథిలాలను తీస్తుండగా తన అమ్మమ్మ మృతదేహం పక్కనే సజీవంగా ఉన్న ఓ ఆరేళ్ల బాలుడిని సిబ్బంది గుర్తించారు. అతడు సజీవంగానే ఉన్నాడని తెలుసుకుని హుటాహుటిన ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా సహాయక చర్యల విషయంలో ప్రభుత్వ స్పందన తగిన రీతిలో లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### రూ. 52 కోట్ల అప్పు తీర్చేందుకు

## మాంసం అమ్ముతున్న బిలియనీర్



వ్యాపార సామ్రాజ్యం దివాలా తీయడంతో తనకున్న రూ.52 కోట్ల అప్పు తీర్చడానికి మాంసం అమ్ముకుంటున్నాడు చైనాకు చెందిన ఓ వ్యక్తి. చైనాకు చెందిన తాంగ్‌జియన్ రెస్టారంట్ల వ్యాపారంలో కోట్ల ఆస్తులు పోగేశాడు. 2005లో ల్యాండ్‌స్కేప్ ఇంజనీరింగ్ పరిశ్రమలో పెట్టుబడులు పెట్టి భారీగా నష్టపోయాడు. దీంతో ఆయన కార్లు, బంగ్లాలు, ఆస్తులు అన్నింటినీ అమ్ముకోవాల్సి వచ్చింది. అయినా రూ.52 కోట్ల అప్పులు మిగిలాయి. అవి తీర్చటం కోసం మాంసంతో తయారు చేసిన ఆహారపదార్థాల విక్రయం మొదలుపెట్టారు. హాంగ్‌ఝౌలోని ఓ వీధిలో దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నారు. జీవితం పెట్టిన పరీక్షలను ఎదుర్కొంటోన్న ఆయన పలువురికి స్ఫూర్తిగా నిలిచారు.



### రాయల్ లుక్‌లో

## నోరా ఫతేహి

నటి నోరా ఫతేహి శైలి యొక్క మ్యాజిక్ ప్రపంచవ్యాప్తంగా ప్రజలపై చాలా పని చేసింది. తన నటనతో, డ్యాన్స్‌తో, లుక్స్‌తో ప్రజలను మంత్రముగ్ధులను చేశారు. ఈరోజు అభిమానులు ఆమె గురించిన ప్రతి విషయాన్ని తెలుసుకోవాలని ఆసక్తిగా ఉన్నారు. అటువంటి పరిస్థితిలో, నోరా దాదాపు ప్రతిరోజూ ముఖ్యాంశాలలో వస్తుంది. ముఖ్యంగా తన లుక్స్ వల్ల అందరి మనసులు దోచేసాడు. ఇప్పుడు మళ్లీ నటి స్టైలిష్ స్టైల్ చూపించారు. నోరా సోషల్ మీడియాలో కూడా చాలా యాక్టివ్‌గా ఉంటుంది. దాదాపు ప్రతిరోజూ తన స్టైల్‌తో అభిమానుల హార్ట్‌బీట్‌ను పెంచుతోంది. ఇప్పుడు మళ్లీ తాజా ఫోటోషూట్‌లో అందరి చూపు నోరాపై పడింది. ఇక్కడ ఆమె బ్లాక్ అండ్ వైట్ కలర్ సిల్క్ ఆఫ్ షోల్డర్ గౌను ధరించి కనిపిస్తుంది. ఆమె ఈ లుక్‌ని కెమెరా ముందు చాలా ప్రదర్శించింది. నోరా న్యూడ్ షిమ్మరీ మేకప్‌తో తన రాయల్ లుక్‌ను పూర్తి చేసింది. దీంతో ఆమె జుట్టు కట్టి, చెవిలో తెల్లటి పోగులు పెట్టుకుంది.



### మరో యువతితో భర్తకు ఎఫైర్..

## భార్య ఆత్మహత్య

భర్త మరో యువతితో ఎఫైర్ పెట్టుకోవడంతో పెళ్లైన 11 నెలలకే భార్య ఆత్మహత్య చేసుకుంది. బెంగళూరులోని రామ్మూర్తి నగర రిచర్డ్ గార్డెన్ లో ఈ నెల 10న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అభిషేక్, శ్వేత దంపతులకు 11 నెలల కిందట వివాహం జరిగింది. అయితే పెళ్లికి ముందు అభిషేక్ కు వేరే యువతితో ఎఫైర్ ఉంది. పెళ్లైన తర్వాత కూడా అభిషేక్ ఆమెతో ఎఫైర్ కొనసాగించాడు. ఈ విషయం శ్వేతకు తెలియడంతో భర్త చేసిన మోసం తట్టుకోలేక ఆమె ఇంట్లో ఉరివేసుకుని సూసైడ్ చేసుకుంది. శ్వేత తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మళ్లీ ట్విట్టర్‌లోకి కంగనా?

బాలీవుడ్ ప్రముఖ నటి కంగనా రనౌత్ ట్విట్టర్ ఖాతాను తిరిగి పునరుద్ధరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో వివాదాస్పద పోస్టులతో ఆమె ఖాతా నిలిచిపోగా.. ఇన్ స్టాకే పరిమితమైంది. అయితే ట్విట్టర్ ఎలన్ మస్క్ చేతుల్లోకి వెళ్లిన తర్వాత బ్యాన్ అయిన ఖాతాలను పోల్ ద్వారా మెజారిటీ ప్రజల అభిప్రాయం మేరకు పునరుద్ధరిస్తున్నారు. దీంతో తనకు తిరిగి ట్విట్టర్ లోకి రావాలన్న కంగనా కోరిక నెరవేరే అవకాశం కనిపిస్తోంది. ఇటీవలే అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ ఖాతాను సైతం ట్విట్టర్ పునరుద్ధరించగా.. ఆయన చేరేందుకు నిరాకరించారు.





### చదివింది గ్రాడ్యుయేషన్..

## శ్మశానంలో జాబ్!

యూనివర్శిటీలో గ్రాడ్యుయేషన్ చేసి శ్మశాన వాటికలో పని చేస్తోన్న ఓ యువతి గురించి నెట్టింట చర్చ జరుగుతోంది. చైనాకు చెందిన 22 ఏళ్ల టాన్.. తన ఆఫీసులో రాజకీయాలకు భయపడి ఉద్యోగం మానేసినట్లు వెల్లడించింది. చాంగ్ కింగ్ లోని పర్వత ప్రాంత శ్మశాన వాటికలో రోజుకు 6 గంటల చొప్పున నెలకు రూ.50 వేలు సంపాదిస్తున్నట్లు సోషల్ మీడియాలో షేర్ చేసింది. అయితే ఎక్కడా ఈ రాజకీయాలు తప్పవని నెటిజన్లు దీనిపై భిన్నంగా స్పందిస్తున్నారు.